క్లుప్తంగా

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పామర్రు: పామర్రు మానవతా సంస్థ ప్రతినిధి పీఎంఎస్ ప్రసాద్, స్థానిక మానవతా కార్యాలయంలో దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఆదివారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సేవాసంస్థ కోశాధికారి పీబీ శ్రీనివాస్ వితరణతో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సేవా సంస్థ కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, ప్రతినిధులు ఎస్.త్రివిక్రమరావు, మండపాక సుబ్బారావు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయ క్యూలో ఆదివారం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

గుంటూరుకు వెళ్లి పింఛన్ అందజేత



గుడ్లవల్లేరు: గుంటూరుకు వెళ్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు కట్టా నాంచారయ్యకు ఆదివారం వడ్లమన్నాడు వలంటీర్ ఎస్.అరుణ ప్రభుత్వ పింఛన్‌ను అందజేశారు. వడ్లమన్నాడుకు చెందిన నాంచారయ్య అనారోగ్యంతో గుంటూరులో చికిత్స పొందుతున్నారు. తన సొంత ప్రయాణ ఖర్చులతో వలంటీర్ గుంటూరుకు వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్‌ను అందించారు.

అవి ఇళ్లు కాదు.. ఊళ్లు

నియోజకవర్గంలో 3,827 గృహాల నిర్మాణం పూర్తి

సంక్షేమ నవశకానికి నవరత్నాలు నాంది పలుకుతున్నాయి. ఈ పథకాల్లో ప్రధానమైనది పేదలందరికీ ఇళ్లు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో పేదలు నిలువనీడ లేకుండా తలదాచుకుంటున్న దుర్భర పరిస్థితులను కళ్లారా చూశారు. అధికారంలోకి రాగానే పేదలందరికీ పట్టాలు అందించడమే కాకుండా పక్కా గృహాలను కట్టించి గృహ ప్రవేశం చేయిస్తానని మాట ఇచ్చారు. మాటతప్పని, మడం తిప్పని మనస్తత్వం కలిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. కోట్ల ఖర్చుతో స్థలాలను కొనుగోలు చేసి, మహిళలకు పట్టాలు అందించారు. జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణ పనులు నేడు శరవేగంగా జరుగుతున్నాయి.



కైకలూరు గ్రీన్ విలేజ్‌లో నూతన షేర్ వాల్ టెక్నాలజీతో నిర్మాణం



కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇంటి నిర్మాణాలతో సుందరంగా తయారవుతున్న కాలనీ

కైకలూరు: నియోజకవర్గంలో కొత్త ఊళ్లుగా జగనన్న కాలనీలు నిలుస్తున్నాయి. ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కల సాకారం చేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వడివడిగా ముందుకు వేశారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మూడు విడతలుగా అందిస్తోంది. ఇదే కాకుండా టన్ను ఇసుకు కేవలం రవాణా ఖర్చులు తీసుకుని ఉచితంగా సరఫరా చేస్తోంది. ఒక్కో సిమెంటు బస్తా బహిరంగ మార్కెట్‌లో రూ.360 ఉండగా లబ్ధిదారులకు కేవలం బస్తా రూ.267కు సరఫరా చేస్తోంది. ఇళ్లు నిర్మించుకోలేని పేదలకు 'షేర్ వాల్ టెక్నాలజీ' విధానంలో త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు.

నియోజకవర్గంలో నిర్మాణాలు ఇలా..

మండలం	కేటాయింపు	బేస్‌మెంట్ లెవల్	పూర్తయినవి	ప్రారంభం కానివి
కైకలూరు	3,914	2,406	1,045	37
కలిదిండి	2,970	1,240	882	99
మండవల్లి	2,144	1,152	619	3
ముదినేపల్లి	3,241	1,860	1,281	0
మొత్తం	12,269	6,658	3,827	139

ఆదర్శంగా కైకలూరు గ్రీన్ విలేజ్

ఏలూరు జిల్లా గృహ నిర్మాణాల్లో కై కలూరు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలుస్తోంది. నియోజకవర్గంలోని కై కలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో ఇప్పటి వరకు 12,269 మందికి గృహ నిర్మాణాలు కేటాయించారు. వీటిలో బేస్‌మెంటు పనులు దాటినవి 6,658 ఉండగా, పూర్తయినవి 3,827 ఉన్నాయి. ఇంకా ప్రారంభించని గృహాలు 139గా లెక్క తేలింది. నియోజకవర్గంలో కైకలూరులో వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో 3,000 మంది లబ్ధిదారులకు 94 ఎకరాలను సేకరించారు. ఇప్పటి వరకు 2,898 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఇక్కడ 1,768 మంది ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.



జగనన్న కాలనీలో నిర్మాణాలకు భారీ యంత్రాలు



మండవల్లిలో జగనన్న గృహనిర్మాణం

అద్దె ఇళ్లలో చాలా కష్టాలు పడ్డాం



ఎప్పటినుంచో మాకంటూ ఒక ఇల్లు ఉండాలని కల ఉండేది. మేముండేది అద్దె ఇంట్లో. దాదాపు 10 సంవత్సరాలు అద్దె ఇళ్లలో చాలా కష్టాలు పడ్డాం. కరోనా పరిస్థితిలో మేము పడ్డ బాధలు వర్ణనాతీతం. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటి పట్టా అందించి రూ.1.80 లక్షలు ఇచ్చి ఆదుకున్నారు. ఇప్పుడు మేము చాలా సంతోషంగా ఉన్నాం. – చెన్నంశెట్టి వరలక్ష్మి, కోరుకొల్లు, కలిదిండి మండలం

జగనన్నకు రుణపడి ఉంటా



సొంతిల్లు లేక అద్దె ఇంటిలో అగచాట్లు పడుతున్న తరుణంలో వలంటీరు ఇంటికి వచ్చి జగనన్న కాలనీలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేయించి, స్థలం మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి అనుమతి మంజూరు చేయించారు. నా సొంతింటి కల నెరవేరేందుకు సాయం అందించిన ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాను. – సీహెచ్.పద్మావతి, లింగాల, మండవల్లి మండలం

హామీలన్నీ అమలు చేసిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే కొడాలి నాని



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్(నందివాడ): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. తొలుత గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానీ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా గ్రామంలో రూ. 23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో హెల్త్ క్లినిక్ భవనం, రూ. 43.40 లక్షలతో గ్రామ సచివాలయాల భవనాలు నిర్మించినట్లు పేర్కొన్నారు. పేదలకు అందజేసే పెన్షన్‌ను హామీ ప్రకారం రూ. 3 వేలకు పెంచారన్నారు. చంద్రబాబు నాయుడు కల్లబొల్లి మాటలు చెబుతూ తాను పేదలకు పెద్ద మొత్తంలో పెన్షన్ ఇచ్చానంటూ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో 31 లక్షల మందికి పెన్షన్ ఇస్తే జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 66 లక్షల 70 వేల మందికి పెన్షన్లు ఇచ్చారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు గుడివాడ నియోజకవర్గంలోని నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు, రూరల్ మండలాలలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఒక్క ఎకరా భూమి కూడా సేకరించలేదన్నారు. గుడివాడ పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన ఫ్లై ఓవర్ నిర్మాణం, బస్టాండ్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి తదితర అభివృద్ధి పనులతో పాటు గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఈ రోజు ప్రారంభించిన భవనాలు ఏర్పాటు చేయడం, జల్‌జీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరా కోసం కోట్ల రూపాయలు వెచ్చించడం వంటి అనేక కార్యక్రమాలు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగాయన్నారు. ప్రజల సంక్షేమం కోసం జగన్‌మోహన్‌రెడ్డి 124 సార్లు బటన్ నొక్కారని, ప్రజలు దీనిని గుర్తుంచుకుని రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాలు బంపర్ మెజార్టీతో గెలిచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాకుమారి, వైస్ ఎంపీపీలు పూడి సుధాకరరావు, జయరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వెన్నా ప్రభావతి, సర్పంచ్ ఎస్.రాధాకృష్ణ, మాజీ సర్పంచ్‌లు అమృతబాబు, వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషన్, చంటి, సుధాకర్, మురళి, ఎంపీడీఓ నాగేశ్వరరావు, కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ నాగమణి పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్ర శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొడాలి నాని

గ్రామస్తుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న మహిళలు

మండవల్లి: మండలంలోని మోదుగుమూడిలో గ్రామస్తుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని వారంతా వయోభేదాలు, కు లమతాలకు అతీతంగా అందరూ ఒక చోట చేరి తమ స్థితిగతులను మరిచి ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తనయుడు దూలం ఆది వినయ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులంతా ఐకమత్యంగా ఒకచోట చేరి ప్రేమాభిమానాలు కనబరచుకోవడం ఆనందదాయకమన్నారు

నేటి నుంచి మొవ్వ సభలు ప్రారంభం

మొవ్వ: స్థానిక మొవ్వ లైఫ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 5,6,7 తేదీల్లో మూడు రోజులపాటు క్రీస్తు సందేశాలు(మొవ్వ సభ) నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు, యేసే జవాబు అధినేత పాస్టర్ వేమూరి పరిశుద్ధరాజు ఆదివారం తెలిపారు. ఈ సభలకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దైవ జనుల ప్రసంగాలు, ప్రత్యేక క్రైస్తవ గీతారాధన కార్యక్రమాలు నిర్వహింపబడనున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన వారికి ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.

ఘనంగా మరియమ్మ తల్లి జాతర

కలిదిండి: ఎస్ఆర్పీ అగ్రహారం శివారు పరసవానిపాలెంలో మరియమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. జాతరలో గరగ నృత్యాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా, రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో ముగ్గులతో వేసిన మరియమ్మ తల్లి నమూనా భక్తులను ఆకట్టుకుంది.

కోడిపందేల శిబిరంపై దాడి

తోట్లవల్లూరు: మండలంలోని చాగంటిపాడులో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి 13 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. దీంతోపాటు రెండు కోడిపుంజులు, రూ. 12,390ను స్వాధీనం చేసుకున్నట్లు తోట్లవల్లూరు ఎస్ఐ పి. విశ్వనాథ్ తెలిపారు.

గ్రంథాలయ భవనం మార్పునకు సహకరించండి



రికార్డులు తనిఖీ చేస్తున్న జమలపూర్ణమ్మ

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయం స్థానంలో కొత్త భవనం నిర్మాణం చేపడుతున్నట్లు కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కృష్ణాజిల్లా చైర్ పర్సన్ టి. జమలపూర్ణమ్మ అన్నారు. ఆదివారం ఆమె గ్రంథాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురాతన భవనం శిథిలావస్థకు చేరుకుందని, దీనిని తక్షణమే తొలగించి కొత్త భవనం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తిరిగి భవనం నిర్మించే వరకు అద్దె భవనంలో గ్రంథాలయం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఖాళీగా ఉన్న భవనాలు గ్రంథాలయ సేవలకు అందజేయాలని కోరారు. గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ, సిబ్బంది ప్రవల్లిక, రవిచంద్ర పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కలిదిండి: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సానా రుద్రవరం గ్రామ సర్పంచ్ నున్న రాజేశ్వరమ్మ అన్నారు. ఎస్ఆర్పీ అగ్రహారం, సానా రుద్రవరం గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్పీలు పవన్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మండవల్లి హైస్కూల్లో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మండవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2005–06 పదో తరగతి విద్యా ర్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమ ఉన్నతస్థితికి మీరే కారణమంటూ అప్పటి ఉపాధ్యాయులు అందరినీ ఘనంగా సత్కరించుకున్నారు.

మెగా ఉచిత వైద్యశిబిరం



మందులను అందజేస్తున్న మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు

గుడివాడ టౌన్(నందివాడ): పిన్నమనేని కోటేశ్వర రావు ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ ట్రస్ట్ రుద్రపాక ఆధ్వర్యంలో ఆదివారం నందివాడ మండలం లక్ష్మీనరసింహపురంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. మొత్తం 470 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి), పిన్నమనేని వీరయ్య చౌదరి, మేకా రాయుడు, వైద్యులు డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పి. మాధవి, డాక్టర్ పి. వంశీకృష్ణ, డాక్టర్ ఎల్. అమర్‌చౌదరి, డాక్టర్ యు.సురేష్‌బాబు, డాక్టర్ కె. శ్రవణ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



విరాళం అందిస్తున్న దాతలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ఆదివారం విరాళాలు అందించారు. గుడివాడకు చెందిన వేముల నాగసాయి బాలాజీ, లక్ష్మి దంపతులు అంతరాలయ ముఖ ద్వారానికి వెండితాపడం చేయు నిమిత్తం రూ.10,116, అదే విధంగా గుడివాడకు చెందిన వేముల మణీశ్వర్ రూ.10,116 విరాళాన్ని ఆలయ కార్యాలయంలో సహాయ కమిషనర్ నేలసంధ్యకు అందజేశారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష వద్దు

ముదినేపల్లి రూరల్: హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపకుండా మంచి మనసుతో వారిని ఆదరించాలని గురజ పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ స్వాతి అన్నారు. చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని గురజలో ఎయిడ్స్‌పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ స్వాతి మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులు సక్రమంగా మందులు వాడుతూ జీవితకాలాన్ని పెంచుకోవచ్చన్నారు. లింక్ వర్కర్స్ స్కీమ్ సూపర్‌వైజర్ బి.రాకేష్, సర్పంచ్ జంగం వెంకటేశ్వరరావు, వీఆర్వో హనుమంతరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, లింక్ వర్కర్స్ జె.చంద్రావతి, సీహెచ్.నాగలక్ష్మి పాల్గొన్నారు.